# ఇనగాలను డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి

■ యువజన కాంగ్రెస్ నేతల వినతి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవిని పరకాల నియోజకవర్గానికి చెందిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాజీ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి కేటాయించాలని పరకాల యువజన కాంగ్రెస్ నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ నేతలు ఏఐసీసీ పరిశీలకులు నవజ్యోతి పట్నాయక్, పీసీసీ పరిశీలకులు దుర్గం భాస్కర్లను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిగా చూసుకుంటారని, ఏ ఆపద వచ్చినా 'నేనున్నాను' అంటూ అండగా నిలిచే నాయకుడని కొనియాడారు. గత 20 సంవత్సరాలుగా పార్టీ బలోపేతం కోసం అపారమైన కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంలో ఆయన పాత్ర కీలకమని గుర్తుచేశారు. కార్యకర్తలందరినీ కలుపుకుపోయే ఆయన చొరవ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా పరకాల నియోజకవర్గ ఇంచార్జిగా పనిచేసిన అనుభవం ఆయనకు డీసీసీ అధ్యక్ష పదవికి అన్ని అర్హతలు కల్పిస్తున్నాయని వారు స్పష్టం చేశారు. ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులను కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండాల క్రాంతి, యూత్ కాంగ్రెస్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, యూత్ కాంగ్రెస్ దామెర మండల అధ్యక్షుడు నల్ల సుధాకర్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులు దామెర రాజు, కొమ్ము శ్రవణ్, కొమ్ము రాజు, ఉపాధ్యక్షుడు/పాక్స్ డైరెక్టర్/సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉడత రాజేందర్, మండల సెక్రెటరీ సిలువేరు రాజు, ప్రధాన కార్యదర్శి బుస్సా శివకుమార్, బాగాది రమేష్, పోలేపాక వినోద్ తో పాటు పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## కోచ్ రవికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లాలోని కాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసించి, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణులకు శిక్షణ ఇచ్చిన తొలి కోచ్, ఫిజికల్ డైరెక్టర్ కె. రవికుమార్ కు ఘన సన్మానం జరిగింది. లావణ్య నార్వేలో జరిగిన హోమ్‌లెస్ వరల్డ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించింది. అమల థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన బేస్‌బాల్ గేమ్స్‌లో ఇండియా తరపున ఆడి, ఇండియా టీం కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించింది. ప్రస్తుతం డోర్నకల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ కె.రవికుమార్ ఈ అంతర్జాతీయ క్రీడాకారిణులకు శిక్షణ ఇచ్చారు. అమల ఇటీవల చైనాలో జరగనున్న ఏషియన్ కప్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా, కోచ్ కె. రవికుమార్‌ను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ లు ప్రత్యేకంగా సన్మానించారు. మంగళవారం డోర్నకల్ జడ్పీహెచ్ఎస్ తోటి ఉపాధ్యాయులు సైతం కె.రవికుమార్‌ను సన్మానించారు. తన వద్ద శిక్షణ పొంది ఇంటర్నేషనల్ స్థాయిలో రాణించే క్రీడాకారులను తయారు చేసిన పీడీ రవి, ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం అని తోటి ఉపాధ్యాయులు కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు బండి నరసింహారావు, అప్పిరెడ్డి విద్యాసాగర్, రమేష్, వెంకటేశ్వర్లు, సీతారాములు, రాంనాయక్, సాహెబ్ అలీ, బిచ్చు, శంకరయ్య, శేషు కుమారి, అనిత, సమిత, వరలక్ష్మి, మాలతి, దమయంతి, వసంత రాణి, అమీనా, కమల పాల్గొన్నారు.

## వసతి గృహాలలో అధికారుల తనిఖీలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** ప్రభుత్వ సూచనలతో పాటు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలో మూడు రోజులు హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, శానిటేషన్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీవీబీ అన్ని విద్యాసంస్థల వసతి గృహాలలో అధికారులు తనిఖీల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించి వసతి గృహాలు, పాఠశాలల్లో పిల్లలకు పౌష్టిక ఆహారం, నాణ్యమైన సాంకేతిక విద్య, సానిటేషన్, డైట్ మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్, స్నాక్స్, పరిసరాల పరిశుభ్రత పిల్లల ఆరోగ్య, మానసిక వైద్య పరీక్షలు చేపట్టి ఉన్నత విద్యా ప్రమాణాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులను, తాహసిల్దార్, ఎంపీడీవోలు సంబంధిత అన్ని విభాగాల అధికారులను తమ పరిధిలో గల వసతి గృహాల తనిఖీ చేసి నివేదికలు అందించనున్నారు.

# విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

■ కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచి, వారు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం ఆమె నడికూడ మండలం రాయపర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలతో పాటు రెండు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి అవగాహన స్థాయిని పరీక్షించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' అమలు తీరు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని మరింత మెరుగుపరచాలని, ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం గురించి కలెక్టర్ ఆరా తీశారు. వంట గదులను పరిశీలించి, నిర్వాహకులను మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాలను కూడా కలెక్టర్ సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న మెనూ చార్ట్‌ను, ఇతర కార్యక్రమాలను అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకుని, వంట గదుల పరిశుభ్రతను పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, తహసీల్దార్ రాణి, మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల స్వామి, భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధ్వానంగా శాలపల్లి కొయ్యూరు రహదారి

ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలు

అధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని శాలపల్లి నుంచి కొయ్యూరు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నిత్యం అధిక లోడ్లతో ఇసుక ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు వెళ్లడం వల్ల ఈ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీని కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. రహదారి అధ్వానంగా మారడంతో విసిగిపోయిన స్థానికులు, వాహనదారులు వెంటనే అధికారులు స్పందించి, ఈ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అంతేకాకుండా, అధిక లోడ్లతో వెళ్లే వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలని, తద్వారా రోడ్డు మరింత దెబ్బతినకుండా ఆపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కార్మికుడి కుటుంబానికి బీమా పరిహారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానం, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగికి, కార్మికుడికి ప్రమాద బీమా కల్పించాలన్న ఆకాంక్ష మేరకు, ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు, 'ఆన్ మ్యాన్డ్' కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించబడింది. ఈ నేపథ్యంలో మంగళవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడి కుటుంబానికి బీమా పరిహారాన్ని అందజేశారు. మహబూబాబాద్ జిల్లా ఏదులాపూసలపల్లి గ్రామానికి చెందిన మృతుడు గట్ల కరుణాకర్ రెడ్డి ('ఆన్ మ్యాన్డ్' కార్మికుడు) జులై 07న ప్రమాదవశాత్తు మరణించగా రూ.20 లక్షలు పరిహారాన్ని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యురాలు గట్ల ప్రియాంకకు 'న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ' ద్వారా ఈ బీమా పరిహారం చెక్కును అందించారు. నిత్యం ప్రమాదంలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు తోడుగా ఉండేందుకు ప్రమాద బీమా తీసుకువచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి ఈ సందర్భంగా గట్ల కరుణాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ వి.తిరుపతి రెడ్డి, న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ హనుమకొండ డివిజనల్ ఆఫీస్ సీనియర్ డివిజనల్ మేనేజర్ నాగభట్ల జ్యోతిర్మయి, మార్కెటింగ్ మేనేజర్ రాజేష్, గుత్తేదారు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ హౌజ్ ను పరిశీలించిన జడ్పీ సీఈఓ



**వరంగల్ వాయిస్, దామెర :** ఇందిరమ్మ మోడల్ హౌస్ ను త్వరగా పూర్తిచేయాలని జడ్పీ సీఈఓ బి.రవి అన్నారు. మంగళవారం దామెర మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను ఆయన పరిశీలించారు. అనంతరం రవి మాట్లాడుతూ నిర్మాణ దశలోనే ఉన్న మోడల్ హౌసును సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీవో కల్పనను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, పంచాయతీ కార్యదర్శి మనోహర్, కారోబార్ బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.